ప్రజాశక్తి
సోమవారం 24 మార్చి, 2025
5
శ్రీకాకుళం



రగ్బీ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జిల్లా జట్టు

టెక్కలి : కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్టు ఎంపికను ఆదివారం చేపట్టారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టిన రగ్బీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్, జూనియర్ జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులకు అవసరమైన దుస్తులు, రవాణా ఖర్చులను జిల్లా అధ్యక్షులు డొంకాన రామకృష్ణ విరాళంగా అందించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి పొన్నాడ పార్వతీశం, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు, ఎన్.జనార్ధనరావు, కాపల రఘునాథరావు, కె.కె.రామిరెడ్డి, సత్యనారాయణ, నర్మద, సీతయ్య, శ్యామలరావు పాల్గొన్నారు.



చెరువులో పడి ఉన్న పైపులు

మెట్ట భూములకు సాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన ఎత్తిపోతల పథకాలు ఏళ్లు గడుస్తున్నా, జిల్లాలో చాలాచోట్ల ప్రారంభానికి నోచుకోవడం లేదు. రైతుల అవసరాల పేరుతో ఘనంగా ప్రారంభించి తర్వాత వాటిని అర్ధాంతరంగా ఆపేస్తున్న పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి పైపులు, ఇతర మెటీరియల్ కొనుగోలుపై శ్రద్ధ చూపుతున్న అధికారులు దాన్ని పూర్తి చేయడంపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పథకాలకు పలుమార్లు ఒప్పంద కాలపరిమితిని పొడిగిస్తూ కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

'ఉత్తి'పోతలే

- పథకాలు ప్రారంభం ఘనం
- కుంటిసాకులతో అర్ధాంతరంగా నిలిపివేత
- వృథా అవుతున్న కోట్లాది రూపాయల ప్రజాధనం
- నీరుగారుతున్న మెట్ట భూములకు సాగునీటి లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఐదుచోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో సారవకోట మండలం బొంతు-సారవకోట-కొత్తూరు పథకం, పొందూరు మండలం లైదాం, గార మండలం కళింగపట్నం, హిరమండలం మజ్జిగూడెం, భామిని మండలం బత్తిలి వద్ద ఎత్తిపోతల పథకాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మజ్జిగూడెం, బత్తిలిలో పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రభుత్వం కాంట్రాక్టును రద్దు చేసింది. దీనిపై హైకోర్టులో ప్రస్తుతం కేసు నడుస్తోంది. మిగిలిన పథకాల పూర్తికి ఎటువంటి అడ్డంకుల్లేకున్నా పనులు మాత్రం జరగడం లేదు. బొంతు-సారవకోట-కొత్తూరు పథకం ద్వారా 11,700 ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం రూ.180.22 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. తండ్యాం ఎత్తిపోతల పథకం ద్వారా 1935 ఎకరాలకు సాగునీరందించేలా రూపకల్పన చేశారు. పథకం కోసం రూ.26.42 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. అదేవిధంగా కళింగపట్నం వద్ద ప్రారంభించిన ఎత్తిపోతల పథకం ద్వారా 2,200 ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్ చేశారు. పథకం నిర్మాణం కోసం రూ.2.55 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

కాంట్రాక్టర్లపై ఎందుకో మెతకవైఖరి

ఒప్పందం ప్రకారం బొంతు-సారవకోట-కొత్తూరు ఎత్తిపోతల పథకం తొలుత చేసుకున్న ఒప్పందం ప్రకారం 2023 జూన్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. తండ్యాం పథకమూ అదే సమయంలో పూర్తి కావాల్సి ఉంది. కళింగపట్నం పథకం 2022 డిసెంబరులోనే పూర్తి కావాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులను పలుమార్లు పొడిగిస్తూ ఈ ఏడాది మార్చి 25వ తేదీ లోగా పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితి ఉంది. పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం మాని వారిపై అధికారులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిధుల ఖర్చుపైనే శ్రద్ధ

పథకాల నిర్మాణ పనుల కోసం అధికారులు పైపులు, ఇతరత్రా మెటీరియల్ పెద్దఎత్తున కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. మెటీరియల్ కొనుగోలు చేసి కూడా పనులు ఎందుకు ప్రారంభించలేదన్న సందేహాలు తలెత్తుతున్నాయి. పైపుల కొనుగోలు కోసం డబ్బులు ఖర్చు చేయడంపై ఉన్న శ్రద్ధ పనులపై ఎందుకు చూపడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వెనుక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లకు ఎక్కడ బెడిసికొట్టిందన్న చర్చ ఆ ప్రాంతంలో నడుస్తోంది.



ఎత్తిపోతల పథకం కోసం తెచ్చిన పైపులను చూపుతున్న రైతులు

మాటలే మిగిలాయి



నాకు సుమారు మూడున్నర ఎకరాల భూమి ఉంది. వర్షాధారంపైనే మేము పంటలు సాగు చేస్తున్నాం. తండ్యాం ఎత్తిపోతల పథకం పూర్తయితే, సాగునీటి కష్టాలు తీరుతాయనుకున్నాం. పథకానికి శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. ఇప్పటికైనా పథకాన్ని వెంటనే పూర్తి చేసి నీరు ఇవ్వాలి.

- కిల్లారి భాస్కరరావు, తండ్యాం (పొందూరు)

వ్యవసాయం మానేస్తున్నారు



నాకు సుమారు 6.80 ఎకరాల భూమి ఉంది. మొక్కజొన్న, వరి, అపరాలను సాగు చేస్తుంటాం. గ్రామంలో పలుచోట్ల బోర్లు ఉన్నా పంటల సాగుకు సరిపడా నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయం చేయలేక మా ప్రాంతం నుంచి రైతులు వలస వెళ్లిపోతున్నారు.

- సకలా వసంతరావు తండ్యాం (పొందూరు)



2019లో ఎత్తిపోతల పథకాలకు ఎమ్మెల్యే రవికుమార్ శంకుస్థాపన చేసిన



మంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

- అత్యున్నత ప్రమాణాలతో అరసవల్లి అభివృద్ధి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా అభివృద్ధికి పెద్దఎత్తున ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి నగరంలోని సూర్యనారాయణ స్వామి, ఉమారుద్ర కోటేశ్వర ఆలయం, పెద్దపాడులోని అప్పన్నమ్మ తల్లి ఆలయాలను ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అరసవల్లిని అత్యున్నత స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు.

గత నెలలో మూడు రోజుల పాటు నిర్వహించిన రథసప్తమి వేడుకలతో జిల్లాకు పేరు ప్రఖ్యాతలు వచ్చాయన్నారు. రథసప్తమి సందర్భంగా అరసవల్లి ఆలయ ఆవరణలో యాత్రికులకు నీడ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారి అవసరానికి తగ్గట్టు నీడనిచ్చేందుకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. షెడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం ద్వారా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినా, విడుదలలో జాప్యమవుతోందని చెప్పారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, అరసవల్లి ఆలయ ఇఒ వై.భద్రాజీ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి...

కోటబొమ్మాళి: విజయవాడ కనకదుర్గమ్మ తల్లి ఆలయానికి ధీటుగా కొత్తమ్మతల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాదయశాఖ ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం అచ్చెన్నాయుడు పుట్టిన రోజు సందర్భంగా టిడిపి నాయకులు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.

తమ్మినేని నకిలీ డిగ్రీపై విజిలెన్స్ విచారణ

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం నకిలీ డిగ్రీ వివాదంపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు ప్రభుత్వ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో తమ్మినేని డిగ్రీ ధ్రువపత్రాలు సమర్పించి మూడేళ్ల లా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఒక వ్యక్తి పేరు మీద ఉన్న డిగ్రీ సర్టిఫికెట్స్ ఆధారంగా చదవని డిగ్రీకి నకిలీ పత్రాలు సృష్టించారని ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ 2023 మార్చిలో రాష్ట్రపత్రి కార్యాలయానికి, తెలుగు రాష్ట్రాల గవర్నర్లకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని రాష్ట్రపతి కార్యాలయం నుంచి గత ప్రభుత్వానికి ఉత్తర్వులు వచ్చినా విచారణ చేపట్టకుండా కాలయాపన చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ్మినేని నకిలీ డిగ్రీపై విచారణ చేపట్టి నిజానిజాలను వెలికి తీయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

అభివృద్ధికి ఎయిర్‌పోర్టు అవసరం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

జిల్లా అభివృద్ధికి ఎయిర్‌పోర్టు అవసరమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గంలో నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు ప్రజలు సహకరించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎయిర్‌పోర్టు వస్తే జిల్లావాసులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి భోగాపురం వరకూ ఎక్కడా ఎయిర్‌పోర్టులు లేవని, పలాస నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు రాకతో రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. దీనిపై టిడిపి శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎచ్చెర్ల దాటి ఒక్క పరిశ్రమ కూడా ఇటువైపు రావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సాధికార సర్వేలో ప్రతిఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులకు నామినేటెడ్ పదవులను సర్వే ఆధారంగా ఇస్తారని చెప్పారు. అనంతరం నిర్వహించి ప్రజా దర్బార్‌లో పలాస మండలం, మున్సిపాల్టీకి చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీకృష్ణ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, పిసిఎంఎ అధ్యక్షులు మల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

తాబేళ్ల గుడ్లకు రక్షణ కరువు

ప్రజాశక్తి- కవిటి

తీర ప్రాంతంలో తాబేళ్ల గుడ్లకు రక్షణ కరువవుతోంది. ముఖ్యంగా తీర ప్రాంతంలో తాబేలు పెట్టే గుడ్లు కాకులు, కుక్కలు పొడిచి తింటున్నాయి. దీంతో తాబేళ్ల సంతతి క్షీణిస్తోంది. కపాసుకుద్దిలో తాబేళ్ల గుడ్లు పరిరక్షణ కేంద్రం ఉన్నా అది కొద్దిమేర గుడ్లు సంరక్షించేందుకే సరిపోతోంది. దీంతో మిగతా గుడ్లు ఇలా కాకులకు - గద్దలకు ఆహారంగా మారుతున్నాయి. అదే తాబేళ్ల గుడ్లు సంరక్షణ కేంద్రం విస్తరిస్తే చాలావరకు తాబేళ్ల పునరుత్పత్తికి దోహదపడుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి తాబేళ్ల గుడ్లు సంరక్షణ కేంద్రాన్ని విస్తరించి, తాబేళ్ల గుడ్లకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



తాబేలు గుడ్లు తింటున్న కాకులు

ఉపాధ్యాయుల సస్పెన్షన్ సరికాదు

- ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి
- మంత్రికి ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్‌లో చూచిరాతకు పాల్పడుతూ పదో తరగతి విద్యార్థులు పట్టుబడితే, ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ మంత్రి అచ్చెన్నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పదో తరగతి పరీక్షల విధులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులంతా భయపడే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులతో చర్చించి సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయించాలని కోరారు. సస్పెన్షన్‌ను రద్దు చేయకపోతే సోమవారం నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో యుటిఎఫ్ నాయకులు చౌదరి రవీంద్ర, బి.శ్రీరామ్మూర్తి, ఎస్‌టియు నాయకులు ఎస్.వి రమణమూర్తి, పిఆర్‌టియు నాయకులు తంగి మురళీమోహన్, బల్లెడ రవి, జి.రమేష్ తదితరులున్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకి సమస్యను వివరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కవులకు అధ్యయనం అవసరం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాహిత్య రంగంలో రాణించాలంటే కవులు, రచయితలకు అనేక అంశాలపై అధ్యయనం అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. అప్పుడే సాహిత్యంపై సరైన అవగాహన ఏర్పడుతుందన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేమన కవితామయం, తపస్వీ మనోహరం సంయుక్తంగా కవితా సంపుటాల పురస్కారాల ప్రదానోత్సవ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యంపై అవగాహన ద్వారా భాష, భావం బలంగా చెప్పే అవకాశం ఉంటుందన్నారు. పరిశీలనా దృష్టితో చదివి అవగాహన చేసుకుని నిర్దిష్టమైన భావాలతో తమ కలాన్ని బలంగా వినిపించినప్పుడే సాహిత్య రంగంలో నిలుదొక్కుకోగలరని చెప్పారు. కవితా సంపుటాల విజేతలు పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలావృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వీర వెంకట సత్యనారాయణ (వైతాళీయ కుచేలోపాఖ్యానం), కడలి ప్రకాశరావు (కడలి కవితా ప్రసూనాలు) సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు. వేమన కవితామయం వ్యవస్థాపకులు ఈ-వేమన అధ్యక్షత వహించిన సభలో సురంగి మోహనరావు, జంధ్యాల శరత్‌బాబు, బుర్రి కుమార్ రాజు, బలివాడ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న నారంశెట్టి తదితరులు

మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలి

వజ్రపుకొత్తూరు: మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వజ్రపుకొత్తూరు రైతు ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ వారికి పలు సూచనలు చేశారు జీడీ ప్రాసెసింగ్, మార్కెటింగ్, సాల్ట్ పరిశ్రమలు ఏర్పాటు చేసి జీవనోపాధులు కల్పించాలని ఆదేశించారు. రికవరీలో వజ్రపుకొత్తూరు సిబ్బంది బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సోంపేట ఏరియా కో-ఆర్డినేటర్ రామ్మోహన్, ఎపిఎం గొడబ ప్రసాదరావు, ఎపిఎం ఈశ్వర్, సిసిలు హరిప్రియ, రేణుక, నీలవేణి, వెంకటరమణ పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు

- లోఓల్టేజీ సమస్యల్లేకుండా జాగ్రత్తలు
- అందుబాటులో 1912 టోల్ ఫ్రీ సేవలు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వేసవిలో విద్యుత్ వాడకం ఏటా పెరుగుతుండడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీరు నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా తీర ప్రాంత గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. అక్కడా అవసరమైనన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా రెండు గంటల వ్యవధిలో మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరిండానికి అవసరమైన యంత్రాంగం అందుబాటులో ఉందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో తీసుకుంటున్న చర్యలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? వేసవి దృష్ట్యా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ప్రజలకు విద్యుత్ అవసరాలు పెరుగుతున్నాయి. పారిశ్రామికంగానే కాక వ్యాపార అవసరాలకు, గృహావసరాలకు విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఏటా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. పెరిగిన అవసరాలకు తగ్గట్టు జిల్లాలో ప్రత్యాయ మార్గాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకుని వినియోగించుకోవాల్సి వస్తోంది. దూర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకున్నప్పుడు అనేక సమస్యలు తరచూ ఉత్పన్న మవుతున్నాయి. ఈ సమస్యల వల్ల తరచూ విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడడం, బ్రేక్‌డౌన్ వంటి సమస్యలు తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. అధిక లోడ్ వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి పెరగడం ఈ సమస్యకు కారణమవుతోంది. దీనికి తోడు జిల్లాలో అత్యంత పొడవైన సముద్ర తీర ప్రాంతం ఉంది. తీర ప్రాంతంలో నివాసగృహాలు, విద్యుత్ వినియోగదారుల సంఖ్య అధికంగానే ఉంటుంది. అందువల్ల ఈ ప్రాంతంలో తరచూ ఇంట్రప్షన్స్ వస్తుంటాయి. వాటిని సకాలంలో సరిచేయడం ద్వారా అక్కడున్న ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

? జిల్లాలో ప్రస్తుత విద్యుత్ వాడకం ఎలా ఉంది?

జిల్లాలో పారిశ్రామిక, గృహావసరాలతో పాటు వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేందుకు ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అందులో అత్యధికంగా గృహావసరాలకు 6.75 లక్షల కనెక్షన్ల ద్వారా విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం. జిల్లాలోని శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో మొత్తం 8,05,204 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 6,75,196 కనెక్షన్లు ఇంటి వినియోగ సర్వీసులే ఉన్నాయి. వీటిలో పక్కా శ్లాబ్, భవంతులపై రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని పెంచుకునే వీలుంది. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. వచ్చే సూర్యరశ్మిని భద్రపరచుకుని విద్యుత్ ఉత్పత్తికి వాడుకునే వీలుంది. శాస్త్రవేత్తలు అనేక రకాల పరిశోధనలు చేసి దీన్ని ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా కనుగొన్నారు. ఈ సౌకర్యాన్ని వినియోగిం చుకోవాలంటే ప్యానల్స్, ఇతర పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. వాటిని అమర్చుకునేందుకు జిల్లాలో 3 లక్షల ఇళ్లల్లో అనువైన పరిస్థితి ఉందని గుర్తించి ప్రోత్సహిస్తున్నాం.

? మృతుల కుటుంబాలకు ఆదుకుంటున్నారా?

విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇపిడిసిఎల్ సంస్థ పరిహారాన్ని అందిస్తోంది. ఘటన సంభవించిన 30 రోజుల వ్యవధిలోనే సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే పరిహారం సకాలంలో అందిస్తున్నాం. అయితే ప్రమాదాలు సంభవించకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. గృహాలు, దుకాణాలు, వ్యవసాయ క్షేత్రాల వద్ద తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిపుణులైన సిబ్బందితో వైరింగ్ చేయించుకోవడంతో ప్రమదాలను నివారించుకోవచ్చు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవు. ఎక్కడైనా విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నా.. మంటలు వస్తున్నా... 1912 నంబరుకు, సమీప విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి. వెంటనే సరిచేసేందుకు వీలుంటుంది.

? సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతినెలా సర్కిల్ కార్యాలయంలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకునేందుక ువీలుగా పరిష్కార వేదిక నిర్వహిస్తాం. సరఫరా సమస్యలు, బిల్లుల్లో వ్యత్యాసాలు, మీటర్ రీడింగ్లో లోపాలపై ఈ వేదికలో ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు. అలాగే ప్రతి సోమవారమూ మీకోసం కార్యక్రమం ద్వారా అందే వినతులను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రానున్న కాలానికి అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చాం. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటాయి. ఈదురు గాలులు, భారీ వర్షాల సమయంలో విద్యుత్ లైన్లు, కండెన్సర్లు, పరివర్తకాలు దెబ్బతింటాయి. స్తంభాలు కూలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సామగ్రిని సంస్థ గోదాముల్లో అందుబాటులో ఉంచుతున్నాం.






విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ త్రినేత్రి

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి- పొందూరు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ టి.త్రినేత్రి అన్నారు. మండలంలోని లోలుగు కెజిబివి పాఠశాలలో ఆదివారం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్‌నేరాలు, ఈవ్‌టీజింగ్‌తో పాటు పలు చట్టాలపై తెలియజేశారు. అనంతరం విద్యార్థినులకు ఏమైనా సమస్యలు ఉంటే తమకుగాని, ఉపాధ్యాయులకుగాని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షునిగా వెంకటరమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రొబెషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా జి.వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎండి గాలిబ్, ట్రెజరర్‌గా ఎస్.వెంకటరావు, గౌరవ అధ్యక్షులుగా బల్లి పద్మలోచన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సర్కిళ్ల వారీగా ప్రాతినిధ్యం కల్పిస్తూ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతి నాయుడు ఆదేశాల మేరకు శ్రీకాకుళం సిఐ ఎం.వి.గోపాలకృష్ణ, నరసన్నపేట సిఐ ఎస్.వి.రమణమూర్తి హాజరై ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న తెలగ సంక్షేమ సంఘం సభ్యులు

తెలగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పొందూరు

మండల తెలగ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం విశ్రాంత రైల్వే ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలగ సంక్షేమ సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పాయక రామారావు, అధ్యక్షుడుగా భాస్కరరావు, కార్యదర్శిగా పిట్టా నారాయణరావు, కోశాధికారిగా గంటా శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులుగా పసుపురెడ్డి లక్ష్మీకుమారి, ఉపాధ్యక్షుడిగా మామిడి కృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులుగా పసుపురెడ్డి శ్రీనివాసరావు, పిల్లా గోవిందరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణస్వీకారం నిర్వహించారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

సొండిల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

రణస్థలం: చిక్కోలు సొండీల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నల్లాన మధు ప్రకాష్, ఉపాధ్యక్షులుగా నల్లాన నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా రత్నాల జగన్మోహనరావు, ట్రెజరర్‌గా సాహుకారి గోపాలరావు, సహయ ట్రెజరర్‌గా పాండవ వెంకట రమణమూర్తి (బాబ్జి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి సొండీల సామాజిక తరగతి పెద్దలు హాజరయ్యారు.

- పది రోజులుగా సంచరిస్తున్న ఏనుగులు
- మొక్కజొన్న, చెరుకు, సారికంద పంటలు ధ్వంసం

'గజ'గజ


మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న ఏనుగులు

ప్రజాశక్తి- కొత్తూరు

నాలుగు ఏనుగులు గుంపు ఈ నెల 11న రాత్రి పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం భామిని మండలం కీసర మీదుగా మండలంలోని కుంటిభద్ర చేరుకున్నాయి. వంశధార నదీతీర గ్రామలైన కడుమ, హంస మామిడి తోటల్లో తిష్ట వేశాయి. ఆయా గ్రామాల్లోని ప్రస్తుతం రైతులు వేసుకున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వసపలోని రైతులు లక్ష్మీనారాయణ, నీలయోలు హేమలత, లింగం దశమి, పాపయ్య, తులుగు తవిటయ్య, పాలిశెట్టి సూర్యం, బత్తిలి నారాయణ, బుచ్చి కామరాజులకు చెందిన పదెకరాలు చెరకు, మిరప, మొక్కజొన్న, సోడి పంటలను నాశనం చేశాయి. అలాగే నీటి ఇంజన్ పైపులను ధ్వంసం చేశాయి. వసప, కుంటిభద్ర నదీతీరానికి ఆనుకున్న గ్రామాలకు చెందిన పాసుపల్లి తులసీరావు, తాతయ్య, మోహనరావు అగతముడి శ్రీనులకు చెందిన ఆరెకరాల విస్తీర్ణంలోని అరటి, మొక్కజొన్న, సారికంద పంటలను ధ్వంసం చేశాయి. నాలుగు ఏనుగుల గుంపు ఆయా గ్రామాల నదీతీర గ్రామాల్లో సంచరించడంతో పగటిపూట కూడా వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్లేందుకు రైతులు భయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీటి సంచారంతో నిద్రలేని రాత్రులు గడుపుతూ భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఏనుగుల గుంపు కుంటిభద్ర నదీ తీర ప్రాంతం మీదుగా భామిని మండలం చేరినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రాణనష్టం లేకుండా చూస్తాం

ఏనుగులు సంచారంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను ఏర్పాటు చేశాం. ఏనుగుల వల్ల నష్టపోయిన రైతుల పంటలను రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో చర్చించి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం. రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

- అమ్మన్నాయుడు, రేంజర్, పాతపట్నం

నష్టపరిహారం చెల్లించాలి



పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి. పంట చేతికొచ్చే సమయంలో సుమారు ఎకరా పంట ధ్వంసం చేశాయి. దీంతో ఆర్థికంగా నష్టపోయాం. అలాగే ఏనులను జూకు తరలించాలి.

- బత్తిలి లక్ష్మీనారాయణ, రైతు, వసప కాలనీ

ఏనుగులు తరలించాలి



నాలుగు ఏనుగుల గుంపును ఇక్కడ నుంచి ప్రభుత్వం అటవీ ప్రాంతానికి తరలించి రైతులను ఆదుకోవాలి. ఏనుగులు తరలించినట్లయితే ఉన్న పంటను కాపాడుకుంటాం. పంట సాగును స్వేచ్ఛగా చేసుకుంటాం. పగటి పూట కూడా వ్యవసాయం చేయడానికి భయపడుతున్నాం.

- సాసుపల్లి తులసీరావు, రైతు, కుంటిభద్ర

సురక్షిత ప్రాంతానికి తరలించాలి



నాలుగు ఏనుగుల గుంపు 18 ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లా కొత్తూరు, భామిని మండలాల్లో సంచరిస్తున్నాయి. ఏనుగుల వల్ల ప్రాణ, పంట నష్టాలు తీవ్రంగా జరిగాయి. పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆర్థికంగా నష్ట పోయారన్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల గుంపు సురక్షిత ప్రాంతానికి తరలించాలి. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- సిర్ల ప్రసాద్, వ్య.కా.స జిల్లా అధ్యక్షులు

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి


కిరణ్‌కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల కేంద్రంలో కేశవరెడ్డి స్కూల్ సమీపంలో పాత జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎచ్చెర్లలో నివాసం ఉంటున్న దేశరాజు వెంకట కిరణ్ కుమార్ (40) మృతిచెందారు. ఈయన రణస్థలం పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ఎచ్చెర్ల గ్రామం కేశవరెడ్డి స్కూల్ ఎదురుగా నివాసం ఉంటున్న వెంకటకిరణ్ కుమార్ రోజులాగే ఉదయం ద్విచక్ర వాహనంపై రణస్థలం వెళ్లేందుకు బయలుదేరారు. రాజాకు చెందిన కొంతమంది టాటా మ్యాజిక్ వ్యానులో వత్సవలస యాత్రకు శ్రీకాకుళం వైపు వస్తుండగా రోడ్డు దాటుతున్న కిరణ్ కుమార్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కిరణ్ కుమార్ తల రోడ్డుకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గతంలో ఎచ్చెర్ల పిహెచ్‌సిలో పనిచేసే మూడేళ్ల క్రితం బదిలీపై రణస్థలం వెళ్లారు. ఈయనకి భార్య స్వప్న కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస: పట్టణంలోని రైల్వే అండర్ పాసేజ్ వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రైల్వే ఉద్యోగి జరజాన కృష్ణ (57) మృతి చెందినట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ఆదివారం ఉదయం ఇసుకలోడుతో ట్రాక్టర్ ఊసవానిపేట రైల్వే గేటు నుంచి బి.ఆర్.నగర్ వైపు వస్తుండగా ద్విచక్ర వాహనంపై జరజాన కృష్ణ మెట్టక్కివలసలోని కుప్పిలివారి వీధిలో నివాసం ఉంటున్న తన స్వగృహానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళకు గాయాలు కాగా ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణ పైనుంచి ట్రాక్టర్ వెళ్లిపోవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడే పడిపోవడంతో స్థానికులు హుటాహుటిన జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు కృష్ణ కామేశ్వరి పేటలో రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి ఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

పొందూరు: పొందూరు రైల్వేగేటు సమీపంలో ఆదివారం అమరావతి రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు (30) మృతి చెందినట్లు ఆమదాలవలస జిఆర్‌పి ఎస్ఐ ఎం.మధుసూధనరావు తెలిపారు. యువకుడు పట్టాలు దాటుతుండగా ఈ సంఘటన జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. యువకుడు ఎరుపురంగు టీషర్టు, బ్లూ కలర్ ప్యాంట్ ధరించినట్లు ఆయన తెలిపారు. యువకుడి ముఖం గుర్తు పట్టలేని విధంగా నుజ్జునుజ్జయిందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఈ కింది ఫోన్ నెంబర్ 9493474582ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ని అభినందించిన 'గద్దె'

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజా సమస్యలపై శాసనసభలో గళం విప్పి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఈశ్వరరావు చూపిన చొరవ అభినందనియమని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు అన్నారు. ఆదివారం ఎన్ఇఆర్ క్యాంప్ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడంతో పాటు అద్భుతమైన నటనా చాతుర్యంతో తెలుగు ప్రజలను, సిఎం చంద్రబాబుని, పవన్ కల్యాణ్‌ని నవ్వించే విధంగా ప్రదర్శన గావించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జూదరుల అరెస్టు

పోలాకి: తొమ్మిది జూదరులను అరెస్టు చేశామని ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. మండలంలోని చల్లబంద వద్ద కొంతకాలంగా పేకాట ఆడుతున్నారని అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. తొమ్మిది మంది వ్యక్తులు గుండ్రంగా వృత్తాకారంలో కూర్చుని డబ్బులను పందెంగా కాసి పేకాట ఆడుతున్నారని అన్నారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.45,400 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో కానిస్టేబుళ్లు వాసు, శంకర్, రమణమూర్తి పాల్గొన్నారు.

వెంకటేష్‌కు అచీవ్‌మెంట్ అవార్డు

బూర్జ: బూర్జ మండల కేంద్రానికి చెందిన వేపారి వెంకటేష్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అత్యుత్తమ సేవలందించినందుకుగాను వెంకటేష్‌కు హ్యూమన్ రైట్స్ అచీవ్‌మెంట్ బెస్ట్ కేటగిరిలో అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియన్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ఆదివారం పాండిచ్చేరిలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వెంకటేష్ అవార్డును అందుకున్నారు. మానవహక్కుల పరిరక్షణతో పాటు సామాజిక సేవను అందించినందుకు ఈ అవార్డు లభించిందని వెంకటేష్ తెలిపారు. తమ గ్రామానికి చెందిన వెంకటేష్ ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు, యువత ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఆయన బిసి సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



అవార్డు అందుకుంటున్న వెంకటేష్


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

కూటమి ప్రభుత్వ అరాచకాలను ఎదిరిద్దాం

- వైసిపిని బలోపేతం చేద్దాం
- వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే వైసిపి నాయకులు, కార్యకర్తలపై అరాచకాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆ అరాచకాలను ఎదిరించి నిలబడదామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద ఆమదాలవలస మండల మున్సిపాలిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వివిధ వర్గాల నుంచి వస్తున్న పన్నులను రాజధాని అమరావతిలో పెట్టి రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారన్నారు. రాజధాని పేరుతో రియల్‌ఎస్టేట్ కార్యక్రమాన్ని చేపట్టి చంద్రబాబు అనుకూలమైన వారికి లబ్ధి చేకూరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రవికుమార్ భూదోపిడీ, అక్రమ ఇసుక రారాజుగా నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారన్నారు. వార్డు మెంబర్‌కు తక్కువ అని తనను తక్కువ చేసి ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతున్నారని చింతాడ రవికుమార్‌ను చూసి ఎమ్మెల్యే బయపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ తన మామ తమ్మినేని సీతారాం దయతో రాజకీయాల్లోకి వచ్చారని తాను సొంత ఇమేజ్ కార్యకర్తల అండదండలతో రాజకీయాల్లోకి వచ్చి నేడు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టానని అన్నారు. సామాన్యుడు పదవులు చేపట్టరాదా, రాజకీయాల్లోకి రావద్దా అంటూ ప్రశ్నించారు. వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు వైసిపి అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. నియోజకవర్గంలో అందరూ జగనన్న పార్టీయేనని ఆయన అడుగుజాడల్లో నడిచి వైసిపిని బలోపేతం చేసి తిరిగి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. రానున్న రోజుల్లో దశలవారీగా పలు సమస్యలపై పోరాటాలు చేసి పార్టీని బలోపేతం చేద్దామని అన్నారు. అనంతరం మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఒకవైపు అధికార పక్షంతోను మరోవైపు ప్రీతి పక్షంలోని ఒక నాయకుడితో పోరాటం చేస్తున్నామని ఇది విచిత్రమైన పరిస్థితి అని అన్నారు. ఈ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి వెళ్లొద్దని కొంతమంది ఫోన్లు చేసి మరీ నాయకులు, కార్యకర్తలకు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయకుల వెనుక కార్యకర్తలు ఉండే రోజులు పోయాయని పార్టీ నిర్ణయమే సుప్రీం అని అన్నారు. ఏది ఏమైనప్పటికీ 2029 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా చింతాడ రవికుమార్‌ను గెలిపించి ముఖ్యమంత్రి పీఠాన్ని జగనన్న అధిరోహించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఖండాపు గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, బద్రి రామారావు, సుబ్బారి నేతాజీ, దుంపల శ్యామ్, సైలాడ దాసునాయుడు, మామిడి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి అజంతా కుమారి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి : మండలంలోని గంగివలస కెజిబివిలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జర్జాపు శారద తెలిపారు. పాఠశాలలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11లోగా https//apkgbv .apCfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తులసీదాస్‌రెడ్డికి అభినందనలు


తులసీదాస్‌రెడ్డి

ఇచ్ఛాపురం: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ పరిధి లోని శ్రీకాకుళం డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన యూనియన్ ఎన్నిక ఏకగ్రీవ మైంది. ఈ ఎన్నికలో ఇచ్ఛా పురానికి చెందిన స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి వైస్ ప్రెసి డెంట్‌గా ఎన్నికయ్యారు. దీంతో ఇచ్ఛాపురంలోని ప్రయి వేటు స్కూళ్ల సంస్థల కరస్పాండెంట్లు అభినందించారు.

'స్పందన' ఆర్థికసాయం

సంతబొమ్మాళి : మండలంలోని బడేకుప్పన్నపేటకు చెందిన కెపి స్పందన ఫౌండేషన్ నందిగాం మండలం మర్లపాడుకు చెందిన కోనారి కాంతమ్మకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈమె కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. పేద మహిళ కావడంతో మందుల ఖర్చుల కోసం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు షణ్ముఖరావు, నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, కొర్రాయి అప్పన్న పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ స్వాతంత్ర్యం కోసం రాజీలేని పోరాటం చేసి బ్రిటిష్ పాలకుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగం మరువ లేనిదని, యువత వారి ఆశయ సాధనలో ముందుకు సాగాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోషఃఅ, కొన్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతిభవన్‌లో వారి 94వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాడు స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిని స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, జి. వసంత్, బాలకృష్ణ, హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : సర్దార్ భగత్ సింగ్ వర్ధంతిని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహించారు. ఎఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, సాంబశివరాజు సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాయకులు శ్యామ్, కిషోర్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

పలాస : కాశీబుగ్గలో భగత్ సింగ్ చిత్రపటానికి కలం గళం క్రియేషన్స్ నుంచి నగిరి కరుణాకర్, బోకర. దుర్యోధనలు పూలమాలలు వేశారు. కుమారి నాట్య చందు భగత్ సింగ్ వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గీతారాణి, మామిడి కోదండరావు, కోర్మాన ఉమాపతి, కుత్తుము లోకనాథం, వందన, మార్పు జగన్మోహనరావు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాలలు బలోపేతం ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుందని, నూతన విద్యా విధానం పేరుతో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు ఇక నుంచి ఉండబోవని, ఈ విషయాన్ని గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, అధికారులు బాధ్యత వహించాలన్నారు. తరగతి ఒక ఉపాధ్యాయుడును నియమించి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, బోడ వెంకట రమణ, డి.దాశరథి, ఎం.లక్ష్మణరావు, ఎన్.తారకేశ్వరరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

'ఉల్లాస్'ంగా రాసేశారు

ప్రజాశక్తి- కవిటి

మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులైన సభ్యులను అక్షరాస్యులుగా మార్చే ఉల్లాస్ కార్యక్రమం మండలంలో దిగ్విజయంగా నిర్వహించినట్లు ఎపిఎం గోవిందరావు తెలిపారు. అందులో భాగంగా మొదటి విడత అభ్యాసకులకు మండలంలోని 58 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలో 2046 మందికి గాను, 1884 మంది హాజరయ్యారు. ఇందులో పాసైయిన వారికి మూడో తరగతి ధ్రువీకరణ పత్రం అందించడమే కాకుండా దూరవిద్య ద్వారా ఐదో తరగతి చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

మందస : ఉల్లాస్ ద్వారా నిరక్షరాస్యులైన వారిని గుర్తించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి చదవడం, రాయడం నేర్పించడం ద్వారా గ్రామీణ మహిళలో ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథ సంచాలకులు పెద్దింటి కిరణ్ కుమార్ తెలిపారు. మందస పంచాయతీలోని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉల్లాస్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఇన్విజిలేటర్ నీరజ, ఎపిఎం పూడి కూర్మారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ స్వామినాయుడు, తారక మోహన్, బాలకృష్ణ పాల్గొన్నారు.


కవిటి : పరీక్ష రాస్తున్న ఉల్లాస్ అభ్యాసకులు

పోలాకి: మండలంలోని పోలాకి, గొల్లలవలస గ్రామాల్లో ఉల్లాస్ పరీక్షలు ప్రశాంతంగా సాగాయని ఎపిఎం రాజారావు తెలిపారు.

కొత్తూరు : మండలంలో 43 పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఉలాస్ పరీక్షకు 974 మంది హాజరు కావాల్సి ఉండగా, 886 మంది పాల్గొన్నారని ఎపిఎం ఎ.లలిత తెలిపారు. కొత్తూరు ప్రాథమిక పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈమె వెంట సిసిలు డి.కేశవ, గోవిందరావు, సిఎఫ్ ఎల్.పుష్ప ఉన్నారు.

పలాస : మండలంలోని 16 సచివాలయాల్లో 856 మంది ఉల్లాస్ పరీక్షలకు హాజరైనట్లు వెలుగు ఎపిఎం జాంబవతి తెలిపారు. బ్రాహ్మణ తర్ల, కేదారిపురం, లక్ష్మీపురం, గరుడఖండి తదితర పంచాయతీల్లో నిర్వహించిన ఉల్లాస్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.


నియామకపత్రాలను అందజేస్తున్న లీల

సాయివినీత్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సాయివినీత్ విద్యా సంస్థల్లో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆ సంస్థ అధినేత, విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లీలాకోదండరావు అన్నారు. ఉద్దానం, తీరప్రాంతంలో నిరుద్యోగులకు ఇదో చక్కటి అవకాశమని అన్నారు. బయట విద్యార్థులతో పాటు మా సంస్థలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. శ్రీసిటీలోని ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలైన కోల్గేట్, డైకిన్, ఫాక్స్కాన్, ఎన్ఎస్ ఇనిస్ట్రుమెంట్స్ ఏషియన్ ఆటో పార్ట్స్, టాలెంట్వర్క్, బ్లూస్టార్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు వచ్చి 130 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారని అన్నారు.

అందులో 65 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ, చదివిన విద్యార్థులకు వివిద బ్రాంచీలలో ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ఆ సంస్థల అధినేత డాక్టర్ కె.లీల, డైరెక్టర్ సిహెచ్.కోదండరావులు నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.కైలాషరావు, సాయిగోపాల్, బత్తిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పెదసాన ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు వెలుగు ప్రసాద్ సస్పెండ్‌ను ఎత్తివేయాలని ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీపై నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం ఆతనిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కోరుతు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కలిసి విన్నవించారు. తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద్ సస్పెండ్ అక్రమమని, కక్షపూరితంగా జరిగిన ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులు ప్రసాద్, చల్లా రామారావు, కె.బాబూరావు, లోహిత్ తదితరులున్నారు.

ఆధార్ అవస్థలు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రంలోని పాత పంచాయతీ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే ఆధార్ అప్‌డేట్ కోసం కేంద్రం వద్ద ప్రజలు అవస్థలు పడుతున్నారు. రేషన్ కార్డులో ఐదేళ్లలోపు ఉన్న పిల్లలకు ఈ నెలాఖరు లోపల ఇకెవైసి అవ్వకపోతే ఆయా యూనిట్లుకు రేషన్‌కార్డులో పేర్లు రద్దుతో పాటు బియ్యం సరఫరా నిలిచి పోతుందని రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు తెలియజేయడంతో తల్లిదండ్రులు చిన్నారులతో ఆధార్ నమోదు కేంద్రాల వద్దకు పరుగులు పెట్టి కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీంతో ఒక్కసారిగా జనాలు పెరిగిపోవడంతో నమోదు ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుండడంతో ఎండవేడికి పిల్లలు తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇకెవైసి నమోదు తేదీని పొడిగించాలని పలువురు కోరుతున్నారు.


ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న చిన్నారులు, తల్లిదండ్రులు

అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

లావేరు: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం అంధకారంలో ఉంది. తహశీల్దార్, ఎంపిడిఒ, పోలీస్‌స్టేషన్, ఆస్పత్రి, వెలుగు, ఉపాధిహామీ, ఎంఇఒ, హౌసింగ్, వ్యవసాయశాఖ ఇలా పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇదే ప్రాంగణంలో ఉన్నాయి. అయితే కార్యాలయాల ప్రాంగణాల్లో లైట్లు లేక ఆ ప్రాంతమంతా అంధకారంగా ఉంటుంది. సాయంత్రమైతే చాలు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు పనులపై వచ్చే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విషసర్పాలు చీకట్లో కార్యాలయాల ప్రాంగణంలో తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పోలీస్‌స్టేసన్‌కు కేసుల విషయమై వందలాది మంది ప్రజలు రాత్రి 10 గంటల వరకు వస్తుంటారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద పనులు అధికంగా ఉన్న రోజుల్లో ఉద్యోగులు రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహిస్తుంటారు. అటువంటి సందర్భాల్లో చీకటిలో భయపడుతూ విధులు నిర్వహి స్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు కార్యాలయాల ప్రాంగణంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.


చీకట్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు



విగ్రహాల వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పోరాట ఫలితమే వర్గీకరణ

ప్రజాశక్తి- పలాస

ఎన్నో దశాబ్దాల పోరాటాలకు ఫలితంగా కూటమి ప్రభుత్వంలో మాదిగల ఉప తరగతులకు న్యాయం జరిగిందని మాదిగల సంఘం నాయకులు ఉర్ణాన అప్పలరాజు, కోల సింహాచలం, సిహెచ్.నేతాజీ, బి.కృష్ణారావులు అన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో తీర్మానమైన సందర్భంగా ఆదివారం కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, దళిత నేత బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పాలాభిషేకం, పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ సామాజిక ఉద్యమాలతో 30 ఏళ్లుగాఅనేక దశల్లో పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎబిఎన్ సింహగర్జన యూత్, మాదిగ సంఘం నాయకులు బి.శివకుమార్, మీల జోగారావు, సోద భీమరాజు, లండ చంద్రయ్య, డి.పాపారావు, సుగుణాకర్, ఆర్.తాతారావు పాల్గొన్నారు.



టిడిపి కండువా వేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

టిడిపిలో సర్పంచ్ చేరిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఇళయపురం వైసిపి సర్పంచ్ సిద్ధిపాలెం గౌరీస్ టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సర్పంచ్‌లకు శనివారం రాత్రి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా గౌరీస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, సంతలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, హనుమంతు చంద్రశేఖర్, వాబ జగన్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు

ఆమదాలవలస : మండలంలోని తొగరాం పంచాయతీ దిబ్బలపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు వేర్వేరుగా రెండు శిలాఫలకాలు వేశారు. కానీ, రోడ్డు మాత్రం నిర్మించలేదు. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సిఎం సహాయనిధి పేదలకు పెన్నిధి అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలో ఏడుగురు లబ్ధిదారులకు రూ.10 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చైతన్యానికి రచనలు దోహదం

ప్రజాశక్తి- టెక్కలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సమాజంలో ప్రజా చైతన్యానికి రచనలు దోహదపడతాయని విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ సనపల నారాయణమూర్తి అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం లోకభాంధవ పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు. సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోడ్డ అయ్యబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మాట్లాడారు. సాంఘీక మాద్యమాలు వ్యాప్తిచెందుతున్న ఈ తరుణంలో ప్రజల్లో నెలకున్న సందేహాలను నివృత్తి చేసేందుకు రచనలు అవసరమన్నారు. లోకభాంధవ పుస్తక రచయిత విద్వాన్ పైడి హరనాథరావు ఆలోచనలతో రూపొందించిన పుస్తక ఆవిష్కరణ మొదటి కాపీని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావుకు అందించారు. సీనియర్ ఉపాధ్యాయులు గుజ్జు వెంకటరెడ్డి అధ్యక్షన పుస్తక రచనలో ఉన్న అంశాలపై గ్రంథ సమీక్షకులు పండి ఢిల్లేశ్వరరావు వివరించారు. నారాయణమూర్తి చేసిన మిమిక్రీ, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురుని అలరించాయి. అనంతరం పుస్తక రచయిత హరనాథరావుని సాహిత్య సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి ఆయ్యబాబు పలువురు పుస్తక ప్రియులు సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ ఎం.జగన్నాథరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు ధనుంజయరావు, హనుమంతు నాగేశ్వరరావు, మోదుగువలస గణపతిరావు, కోరాడ మోహనరావు, కుప్పిలి కామేశ్వరరావు, ఆకుల ప్రకాశరావు, ప్రధాన హరిచంద్రరావు, రోణంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పైడితల్లమ్మ జాతరకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పైడితల్లమ్మ అమ్మవారి 40వ జాతరకు ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈనెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి పెద్దఎత్తున యాత్రికులు తరలివస్తుంటారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరగకుండా ముందుస్తుగా కట్టుదిట్టమైన భద్రతను చేపట్టారు. జాతరకు వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలను కమిటీసభ్యులు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పలు సాంసక్కృతిక కార్యక్రమాలను కమిటీసభ్యులు ఏర్పాటు చేశారు.



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రవికుమార్

పైడితల్లి అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దర్శించుకున్నారు. ఏటా జాతర సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కలను సమర్పించుకుంటారు. ఈయన వెంట ఎంపిటిసి-4 బాడాన హారిక, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, బలగ శంకరభాస్కరరావు, చిన్నరంగా, కాలెపు శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ తదితరులున్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 95 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు ఇడదాసుల వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైనా ఎండను సైతం లెక్కచేయకుండా ఇంతమంది రక్తదానం చేయడం గర్వకారణమన్నారు.

ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ అధ్యక్షులు తిరుపతిరాజు, సూర్య ఆస్పత్రి వైద్యులు ఇడదాసుల యశ్వంత్, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, రణస్థలం మండల వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం ఎంపిటిసి ప్రతినిధి మజ్జి రమేష్, సభ్యులు రాయపురెడ్డి శ్రీనివాసరావు, మింద్రాన రామారావు, దన్నాన రమణ, పసుపురెడ్డి సురేష్, చోడిశెట్టి చంద్రశేఖర్, కూనిబిల్లి సత్యారావు, రాజపంతుల పవన్, రాజపంతుల సాయి, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ తొత్తడి మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ మార్పులో యువత భాగస్వామ్యం

ప్రజాశక్తి- పలాస

సమాజ మార్పులో యువత భాగస్వాములు కావాలని బొడ్డపాడుకు చెందిన యువజన సంఘం నాయకులు మద్దిల రామారావు, శ్రీనివాసరావు దుష్యంత్, గణేష్ అన్నారు. మండలంలోని బొడ్డపాడులో యువజన సంఘం 71వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముందుగా అమరవీరులకు నివాళ్లర్పించారు. భగత్ సింగ్, సుఖం దేవ్ రాజ్ గురుల ఫొటోలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రకారకాల పార్టీలతో మమేకమై పోయి యువజన సంఘాన్ని భ్రష్టు పట్టించిన వైనం మనం చూశామన్నారు.

బొడ్డపాడు యువజన సంఘం రియల్ హీరోలు తామడ గణపతి, పంచాది కృష్ణమూర్తి, పాపారావు, గోపాల్ వీరిని మరిచి, పాలక పక్షాల పోటోలు పెట్టుకొని యువజన సంఘం పేరును భ్రష్టు పట్టించిన నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు అప్పారావు, కార్యదర్శి మద్దిల నారాయణ, కైలాస్ మద్దిల సాగర్, వినీల్, జగదీష్, రాజారావు, మహిళా సంఘం నాయకులు సుందరమ్మ, దాలమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అప్పలరాజు

సత్యరాజు మృతి తీరని లోటు

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేట సర్పంచ్ వంక సత్యరాజు మృతి వైసిపికి తీరని లోటు అని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర డాక్టర్ల సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంచినీళ్లపేటలో ఆదివారం నిర్వహించిన సంతాపసభలో పాల్గొని మాట్లాడారు. ముందుగా సత్యరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అద్యక్షుడు దువ్వాడ మధుసూదనరావు, వైస్ ఎంపిపి వంక రాజు, మందస ఎంపిపి డొక్కరి, దానయ్య, పలాస మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, వంక లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ వేదిక సలహాదారునిగా చందనరావు

శ్రీకాకుళం అర్బన్ : బాలలహక్కుల పరిరక్షణ వేదిక శ్రీకాకుళం జిల్లా సలహాదారునిగా సంతబొమ్మాళి ప్రభుత్వోన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తమ్మినేని చందనరావు నియమితులయ్యారు. వేదిక జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి, రాష్ట్ర దినసరి ప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ గురుబెల్లి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ అరుణ్‌లు ఈ నియామకాన్ని చేపట్టారు. ఆదివారం నగరంలోని బాలలహక్కుల పరిరక్షణ వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు చేతులమీదుగా నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థమైన బాలలహక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. సంస్థ తనపై ఉంచిన నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకుని తనవంతు బాలలహక్కుల రక్షణకై సేవలందిస్తామన్నారు.



దీక్షలో పాల్గొన్న ప్రగడపుట్టుగ, బెజ్జిపుట్టుగ గ్రామస్తులు

న్యాయం చేయాలి

కవిటి: తమకు న్యాయం చేయాలని బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని కవిటి బస్టాండ్ ఆవరణలో బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 452వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో ప్రగడపుట్టుగ, బెజ్జిపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమన్ బిసాయి మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది జారీ చేస్తున్న కమ్యూనిటీ, నేటివిటీ, డేట్ అఫ్ బర్త్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లలో పూర్తిస్థాయి తరగతి లేకపోవడంతో తమ విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్‌కు దూరమవుతున్నారని అన్నారు. ఉన్నత చదువులు చదివేందుకు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో శ్రీరామ్మూర్తి బిసాయి, మాధవరావు దళాయి, హరీష్ సాహు, కృష్ణ దళాయి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

మెళియాపుట్టి: పశువులకు తప్పనిసరిగా రైతులు టీకాలు వేయించాలని టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ విజయరాజు పిలుపునిచ్చారు. మండలంలో చింతలపోలూరులో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెళియాపుట్టి ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి పి.అనిల్, పశువైద్య సిబ్బంది రమేష్, చలపతి, మీనాక్షి, సంపత్, గణపతి, పి.గణపతి పాల్గొన్నారు